# ఎన్నికలకు సర్వం సిద్ధం

## సైబరాబాద్ పరిధిలో 4జిల్లాలు.. 13 అసెంబ్లీ నియోజకవర్గాలు

- 34,42,219ఓటర్లు.. 3202 పోలింగ్ స్టేషన్లు
- 655 సమస్యాత్మక పోలింగ్ స్టేషన్‌ల గుర్తింపు
- ఎన్నికల బందోబస్తుకు 6400 మంది పోలీసు బలగాల మోహరింపు
- తొలిసారిగా అందుబాటులోకి జీఐఎస్ సిస్టమ్
- సైబరాబాద్ పోలీసు కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర



సిటీబ్యూరో, నవంబర్ 29 (నమస్తే తెలంగాణ): నేడు జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు భద్రతా పరంగా సర్వం సిద్ధం చేసినట్లు సైబరాబాద్ పోలీసు కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర వెల్లడించారు. కమిషనరేట్ పరిధిలోకి నాలుగు జిల్లాలు వస్తాయని, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాలోని 13 నియోజకవర్గాలు ఉన్నాయన్నారు. సైబరాబాద్ పరిధిలో మొత్తం 34,42,219 మంది ఓటర్లు ఉండగా, 3202 పోలింగ్ స్టేషన్‌లను ఏర్పాటు చేసినట్లు సీపీ వివరించారు. ఇందులో 655 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు గుర్తించామన్నారు. ఆ కేంద్రాల వద్ద పారా మిలటరీ ఫోర్స్‌ను మోహరించామన్నారు. 103 స్ట్రైకింగ్ ఫోర్స్ బృందాలు, 40 స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్‌ను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఏవైనా ఘటనలు జరిగితే పట్టణ ప్రాంతాల్లో 5 నిమిషాల్లోనే స్పందించే విధంగా, గ్రామీణ ప్రాంతాల్లో 8 నిమిషాల్లో స్పందించే విధంగా సాంకేతికపరమైన ఏర్పాట్లు చేశామన్నారు. కమిషనరేట్ వ్యాప్తంగా ఎన్నికల బందోబస్తు కోసం మొత్తం 6,400 మంది పోలీసులను మోహరించామన్నారు. అందులో 5,200 మంది సివిల్ పోలీసులు కాగా, 1,200మంది ఆర్మ్‌డ్ రిజర్వ్ ఫోర్స్‌తో పాటు మూడు కంపెనీల స్పెషల్ పార్టీ (టీఎస్ఎస్‌పీ), 18 కంపెనీల సెంట్రల్ పారామిలటరీ ఫోర్స్‌తో ఎన్నికల విధులు నిర్వహించనున్నట్లు సీపీ తెలిపారు.

### 23 అంతర్ జిల్లా సరిహద్దు చెక్ పోస్టులు..

కమిషనరేట్ పరిధిలో మొత్తం 23 అంతర్ జిల్లా సరిహద్దు చెక్ పోస్టులను ఏర్పాటు చేసినట్లు సీపీ తెలిపారు. అక్కడ అక్రమంగా తరలించే మద్యం, డబ్బులు, బంగారం, ఇతర వస్తువులపై నిఘా ఉంటుందన్నారు.

### 169.3కోట్ల సొత్తు సీజ్..

ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి బుధవారం సాయంత్రం వరకు కమిషనరేట్ పరిధిలో మొత్తం రూ. 169.3కోట్ల విలువైన సొత్తును సీజ్ చేసినట్లు సీపీ వివరించారు. అందులో రూ.99.53 కోట్ల విలువైన బంగారం, రూ.62.60కోట్ల నగదు, రూ.1.29కోట్ల విలువైన 2,6954 లీటర్ల మద్యం, 3.26కోట్ల విలువైన 1,270 కిలోల గంజాయి, రూ.2.57కోట్ల ఉచిత పంపిణీలను సీజ్ చేసినట్లు వివరించారు.

### కేంద్రాల వద్ద భారీ భద్రత..

కమిషనరేట్ పరిధిలో మొత్తం 6 డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు, 6 రిసెప్షన్ సెంటర్లు, 2 కౌంటింగ్ సెంటర్లను ఏర్పాటు చేశారని, ఈ కేంద్రాల వద్ద ఆర్మ్‌డ్ ఫోర్స్‌తో భద్రత ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈవీఎంలు, వీవీప్యాట్‌లకు పూర్తిస్థాయి భద్రత కల్పించామన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద కేంద్ర బలగాలు, రాష్ట్ర ప్రత్యేక బలగాలు, సివిల్ పోలీసులతో కలిసి మూడంచెల భద్రతను ఏర్పాటు చేశామన్నారు.

### స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద..

స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పారా మిలటరీ బలగాలతో మొదటి అంచె భద్రత, ఆర్మ్‌డ్ ఫోర్స్‌తో రెండో అంచె భద్రత, స్ట్రాంగ్ రూమ్‌ల బయట సివిల్ పోలీసులతో మూడో అంచె భద్రతను ఏర్పాటు చేశామని కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర వెల్లడించారు. పూర్తి భద్రత మధ్య ఈవీఎంలు, వీవీపాట్స్, తదితర ఎన్నికల సామగ్రిని పోలింగ్ కేంద్రాలకు తరలించినట్లు తెలిపారు.

### తొలిసారిగా జీఐఎస్ వినియోగం..

అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా మొట్ట మొదటిసారిగా పీఎస్ఐఐసీ సెంటర్ ద్వారా జియోగ్రఫి ఇన్‌ఫర్మేషన్ సిస్టమ్‌ను వినియోగిస్తున్నామన్నారు. బందోబస్తులో భాగంగా మోహరించిన పోలీసు, భద్రతా బలగాలను పూర్తిస్థాయిలో డిజిటలైజ్ చేశామన్నారు. అన్ని పోలీసు వాహనాలకు జీపీఆర్ సిస్టమ్‌ను ఏర్పాటు చేశామన్నారు.

### అన్ని పోలింగ్ స్టేషన్‌లకు జియోటాగ్..

కమిషనరేట్ పరిధిలోని అన్ని పోలింగ్ స్టేషన్ల లొకేషన్లను జియోట్యాగ్ చేశామని, సున్నిత పోలింగ్ స్టేషన్లలో సీసీ కెమెరాలను అమర్చామన్నారు. అంతేకాకుండా.. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను సైబరాబాద్ వాట్సాప్ కంట్రోల్, సోషల్ మీడియా మానిటరింగ్ సెల్ ద్వారా స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. ప్రజలు నిర్భయంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సీపీ స్టీఫెన్ రవీంద్ర సూచించారు. ఎవరైనా మభ్యపెట్టే ప్రయత్నం చేసినా, బెదిరింపులకు పాల్పడినా, ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సీపీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## ఎన్నికలకు పటిష్ట భద్రత

### రాచకొండ సీపీ, డీఎస్ చౌహాన్



సిటీబ్యూరో, నవంబర్ 29 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో భారీ భద్రతా ఏర్పాట్లు చేసినట్టు రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ తెలిపారు. బుధవారం సరూర్ నగర్ ఇండోర్ స్టేడియం, ఇబ్రహీంపట్నం సీవీఆర్ కళాశాలలో భద్రతా ఏర్పాట్లను సీపీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలు సజావుగా సాగేందుకు అవసరమైన అన్ని రకాల భద్రతా ఏర్పాట్లను చేసినట్లు పేర్కొన్నారు. గురువారం సాయంత్రం ఐదు గంటల వరకు పోలింగ్ కేంద్రాల చుట్టూ 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. అక్రమ నగదు, మద్యం రవాణాను అడ్డుకోవడానికి చెక్ పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ డీసీపీ సాయి శ్రీ తదితర అధికారులు పాల్గొన్నారు.

## సీనియర్ సిటిజన్స్ కోసం ఉచితంగా వాహన సేవలు

- పోలింగ్ కేంద్రాలకు తరలింపు.. తిరిగి ఇంటికి కూడా..
- జీహెచ్ఎంసీ పరిధిలో 250 క్యాబ్‌లు, 120 ఆటోలు, 1200 బైకులు
- తెలంగాణ గిగ్ ప్లాట్‌ఫాం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సేవలు
- ఓటింగ్ శాతం పెంచడమే లక్ష్యం

సిటీబ్యూరో, నవంబర్ 29 ( నమస్తే తెలంగాణ): గ్రేటర్ హైదరాబాద్‌లో ఓటింగ్ శాతాన్ని పెంచడంలో భాగంగా తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫాం వర్కర్స్ యూనియన్ ఉచిత ట్రాన్స్‌పోర్టేషన్ సేవలను ప్రారంభించింది. సీనియర్ సిటిజన్స్‌ను ఇంటి నుంచి పోలింగ్ కేంద్రాలకు, తిరిగి ఇంటికి తరలించడానికి వాహన సేవలు అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ మేరకు ఆ సంస్థ ఫౌండర్ షేక్ సలావుద్దీన్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అత్యధికంగా సీనియర్స్ సిటిజన్స్ అనేక అనారోగ్య ఇబ్బందులతో సతమతమవుతుంటారని..వారు ఓటింగ్ కోసం కేంద్రాలకు రాలేకపోతున్నారని గుర్తించి మానవీయ కోణంలో ఈ సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే ఎన్నికల అధికారుల నుంచి సీనియర్ సిటిజన్స్ వివరాలు తీసుకున్నామని చెప్పారు. నగరంలో 250 క్యాబ్స్, 120 ఆటోలు, 1200 బైకులు అందుబాటులో ఉంటాయని వివరించారు. మరింత సమాచారం కోసం 9642424799 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

## గగన్‌పహాడ్ పారిశ్రామిక వాడలో అగ్ని ప్రమాదం



భారీగా మంటలు

శంషాబాద్ రూరల్, నవంబర్ 29 : గగన్‌పహాడ్ పారిశ్రామిక వాడలోని థర్మకోల్ కంపెనీలో బుధవారం సాయంత్రం వెల్డింగ్ పనులు చేస్తుండగా భారీ అగ్నిప్రమాదం జరిగింది. కంపెనీ సిబ్బంది, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గగన్‌పహాడ్ పారిశ్రామిక వాడలోని

### మంటలు అదుపుచేసిన అగ్నిమాపక శాఖ

రంగోళి ఈపీఎస్ థర్మకోల్ కంపెనీలో బుధవారం సాయంత్రం సిబ్బంది వెల్డింగ్ పనులు చేస్తుండగా.. షాట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం సంభవించింది. కంపెనీలో గ్యాస్ సిలిండర్లు ఉండటంతో స్థానికులు తీవ్ర భయందోళనకు గురయ్యారు. కంపెనీ యజమాని అప్రమత్తం కావడంతో కొన్ని గ్యాస్ సిలిండర్లను బయటకు తరలించారు. అప్పటికే మంటలు వ్యాపించాయి. విషయం తెలిసిన వెంటనే వచ్చిన నాలుగు ఫైర్ ఇంజన్లు గంట వ్యవధిలో మంటలను అదుపు చేశాయి. ఈ ప్రమాదంలో దాదాపు రూ. ఏడు లక్షల ఆస్తినష్టం జరిగినట్టు అధికారులు చెబుతున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు శంషాబాద్ ఆర్‌జీఐఏ పోలీసులు తెలిపారు.

## ఏడాదిన్నర చిన్నారికి కాక్లియర్ ఇంప్లాంట్ శస్త్రచికిత్స

బన్సీలాల్‌పేట, నవంబర్ 29 : గాంధీ దవాఖానలో తొలిసారిగా 18 నెలల చిన్నారి వినికిడి సమస్య నివారణకై కాక్లియర్ ఇంప్లాంట్ శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించారు. చెవి, ముక్కు, గొంతు (ఈఎన్‌టీ) విభాగం హెచ్‌ఓడీ ప్రొఫెసర్ ఎ.శోభన్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా నారాయణ్‌ఖేడ్, కొండాపూర్ లోని మిత్యా నాయక్ తండాకు చెందిన పి.శివరామ్ ఏడాదిన్నర వయసున్న కుమార్తె పి.శివకన్యకు పుట్టుకతోనే వినికిడి సమస్య ఉన్నట్టు గుర్తించారు. బుధవారం ఆ చిన్నారికి కాక్లియర్ ఇంప్లాంట్ శస్త్ర చికిత్స పూర్తి చేశామన్నారు. ఈ చికిత్సను ఆరోగ్యశ్రీ పథకం కింద చేసినట్టు తెలిపారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో ఈ చికిత్స చేసుకుంటే దాదాపు రూ. 15 లక్షలకు పైగానే ఖర్చు అవుతుందన్నారు. ప్రస్తుతం బాలిక బాగానే ఉన్నదని చెప్పారు. చెవి లోపల కాక్లియర్ ఇంప్లాంట్‌ను అమర్చిన తరువాత చిన్నారులు సాధారణ వినికిడి, శబ్దాలను వినడం, భాషను గుర్తించడంతో వారు మిగతా పిల్లల మాదిరిగానే మాట్లాడగలరని తెలిపారు. సాధారణ విద్యార్థుల మాదిరిగానే పాఠశాలకు వెళ్లి చదువుకోగలరని చెప్పారు. ఆగస్టు 2022 నుంచి గాంధీ దవాఖానలో నవజాత శిశువులకు వినికిడి శక్తి పరీక్షలను నిర్వహిస్తున్నామన్నారు. వినికిడి సమస్య ఉన్నట్లు గుర్తించిన చిన్నారులకు నిర్వహించిన కాక్లియర్ ఇంప్లాంట్ శస్త్ర చికిత్సల్లో ఇప్పటి వరకు అత్యంత చిన్న వయస్సు గల చిన్నారి ఈ అమ్మాయేనని ఆయన తెలిపారు. ఈ శస్త్ర చికిత్సలో ఈఎన్‌టీ వైద్యులు డాక్టర్ రాథోడ్, డాక్టర్ కబీర్, డాక్టర్ దీప్తి, అనస్థీషియా డాక్టర్ మురళీధర్, హెడ్ నర్సులు జాస్మిన్, వాసంతి, దేవి, ఆడియాలజిస్టులు సాయికిరణ్, అనూష తదితరులు పాల్గొన్నారు.



శస్త్ర చికిత్సలో పాల్గొన్న ఈఎన్‌టీ హెచ్‌ఓడీ శోభన్‌బాబు, వైద్యులు, సిబ్బంది

## ప్రలోభానికి తెరలేపిన కాంగ్రెస్

నాగారంలో నగదు పంపిణీ ● పట్టుకున్న బీఆర్ఎస్ నేతలు

మేడ్చల్ కలెక్టరేట్, నవంబర్ 29 : ఎన్నికల ప్రచారం ముగియగానే కాంగ్రెస్ పార్టీ ప్రలోభాలకు తెరలేపింది. ఎలాగైనా గెలువాలని నగదు పంపిణీ షురూ చేసింది. నాగారం, దమ్మాయిగూడ, రాంపల్లి, కీసర తదితర ప్రాంతాల్లో బుధవారం కాంగ్రెస్ అభ్యర్థి వజ్రేశ్ యాదవ్ అనుచరులు నగదు పంపిణీ చేపట్టారు. ఇందులో భాగంగా నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డులో కాంగ్రెస్ నాయకులు డబ్బులు పంపిణీ చేస్తున్నట్టు బీఆర్ఎస్ నేతలకు సమాచారం వచ్చింది. వెంటనే డబ్బులు పంపిణీ చేస్తున్న బస్తీకి వెళ్లారు. అక్కడ వజ్రేశ్ యాదవ్ అనుచరులు డబ్బులు పంపిణీ చేస్తుండగా.. రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వెంటనే పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు నిందితుల నుంచి దాదాపు రూ.10 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా నాగారం మున్సిపాలిటీ ఛైర్‌పర్సన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, బీఆర్ఎస్ నేతలు వామన్, నిమ్మల శ్రీనివాస్, రాహుల్ రెడ్డి తదితరులు కాంగ్రెస్ తీరుపై మండిపడ్డారు.

## కోడ్‌ను ఉల్లంఘించిన అజారుద్దీన్‌పై కేసు

బంజారాహిల్స్, నవంబర్ 29: ప్రచార సమయం ముగిసిన తర్వాత కూడా కార్యకర్తలతో సమావేశం నిర్వహించి.. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిన జూబ్లీహిల్స్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి మహ్మద్ అజారుద్దీన్‌తో సహా 8 మందిపై ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. షేక్‌పేట డివిజన్ పరిధిలోని బృందావన్ కాలనీలోని ఓ భవనంలో జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి అజారుద్దీన్‌తో పాటు పలువురు కార్యకర్తలు మంగళవారం రాత్రి 9 గంటల సమయంలో సమావేశమయ్యారు. దీనిపై స్థానికులు ఎన్నికల సంఘం ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి అభిషేక్ తివారీకి ఫిర్యాదు చేశారు. దీంతో అక్కడికి చేరుకున్న అభిషేక్ తివారీతో పాటు ఇతర అధికారులు భవనంలోకి వెళ్లి చూడగా.. సుమారు 10 మంది నాయకులు, కార్యకర్తలతో కలిసి అజారుద్దీన్ సమావేశం నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. సాయంత్రం 5 గంటల తర్వాత సమావేశాలు నిర్వహించడం ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన కిందకు వస్తుందని, ఈ మేరకు చర్యలు తీసుకోవాలని ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి అభిషేక్ తివారీ ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అజారుద్దీన్‌తో పాటు సయ్యద్ అఫ్రోజ్, మహ్మద్ సలావుద్దీన్, షౌకత్ అలీ, ఖాన్, సయ్యద్ రషీద్ హుస్సేనీ, రహమాన్ తదితరులపై ఐపీసీ 188, 143 రెడ్‌విత్ 34తో పాటు 126 ఆర్‌పీ యాక్ట్ కింద కేసు నమోదు చేసిన ఫిలింనగర్ పోలీసులు.. దర్యాప్తు చేపట్టారు.